
రాష్ట్రానికి మూడు రోజులు వర్ష సూచన

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రతతో అలమటిస్తు న్న రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గురువారం నుంచి మూడు రోజుల పాటు ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని పేర్కొంది. కల్యాణకర్ణాటకతో పాటు కోస్తా జిల్లాల్లో వర్షాలుపడే అవకాశం ఉందని నగరంలో బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఈ వారం ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ఉష్ణోగ్రత, తాగు నీటి సమస్యలతో అల్లాడుతున్న రాజధాని ప్రజలు వర్షంకోసం ఆశగా ఎదురు చేస్తున్నారు.

సీనియర్లలో అయోమయం









- బెళగావి స్థానం కోసం శెట్టర్ శత ప్రయత్నాలు
- బెంగళూరు ఉత్తర తప్పడంతో సదానందగౌడ సందిగ్ధం
- తెగించిన ఈశ్వరప్ప.. శివమొగ్గ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ
- బీజేపీలో గందరగోళం

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో టిక్కెట్లు ఎవరికి దక్కుతాయనేది అంతుచిక్కని విధంగా మారింది. వారిద్దరు ఒకప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రులుగా వ్యవహరించారు. ప్రతిపక్షనేతలుగాను కొనసాగారు. అలాంటి ప్రస్తుత ఎన్నికలలో కేవలం ఒక లోక్‌సభ స్థానానికి టిక్కెట్ దక్కుతుందా లేదా అనే గందరగోళంలో పడిలేస్తున్నారు. రాష్ట్రంలోని 28 లోక్‌సభ స్థానాలలో 20 స్థానాలకు బీజేపీ తొలి జాబితాలో పేర్లు ప్రకటించింది. జేడీఎస్‌కు మూడు స్థానాలు కేటాయించగా మిగిలిన ఐదు స్థానాల అభ్యర్థుల్లో రెండుచోట్ల అవకాశం దక్కుతుందా అని ఎదురు చూస్తున్నారు మాజీ సీఎంలు జగదీశ్ శెట్టర్, సదానందగౌడ. జగదీశ్‌శెట్టర్ సుదీర్ఘకాలంగా బీజేపీలో ఎన్నో కీలక పదవులు అనుభవించారు. ఇటీవల శాసనసభ ఎన్నికల వేళ టికెట్ దక్కకపోవడంతో కమలదళానికి గుడ్‌బై చెప్పిన జగదీశ్‌శెట్టర్ కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయినా కాంగ్రెస్ వారు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. కానీ అక్కడ ఉండలేక ఇటీవలే మళ్లీ బీజేపీలోకి వచ్చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన సొంత జిల్లా హుబ్లీ-ధారవాడ స్థానం కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి కాకుంటే తనకు దక్కుతుందని భావించారు. కానీ పార్టీ తొలి జాబితాలోనే జోషి పేరు ఖరారు కావడంతో ఆశలు సగానికి తగ్గాయి. వియ్యంకురాలు ప్రాతినిధ్యం వహిస్తున్న బెళగావి టిక్కెట్ కోసం తీవ్రమైన కసరత్తు చేస్తున్నారు. అయితే బెళగావి స్థానిక నేతలు శెట్టర్ వద్దంటూ వ్యతిరేకత తెలుపుతున్నారు. ఇలా బెళగావి దక్కుతుందో లేదో అనే సంశయంలో శెట్టర్ ఉన్నారు. ఇదే విషయమై బుధవారం హుబ్లీలో మీడియాతో మాట్లాడుతూ బెళగావి నుంచి టిక్కెట్ వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

సందిగ్ధంలో సదానంద గౌడ

రాష్ట్ర బీజేపీలో సదానందగౌడ చేపట్టని పదవి లేదు. శాసనసభ్యుడిగా, ముఖ్యమంత్రిగా, పరిషత్‌లో ప్రతిపక్షనేతగానే కాకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఏకంగా ఏడేళ్లపాటు కేంద్రమంత్రిగా కలిసి పనిచేశారు. పనితీరు బాగాలేకపోవడంతో రెండేళ్ల కిందట ఆయనను కేబినెట్ నుంచి తప్పించారు. ఏడాది కిందట ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని ప్రకటించారు. దీంతో ఆయనకు టిక్కెట్ ఇవ్వకూడదని పార్టీ కూడా భావించింది. కానీ మూడునెలల కిందట మరోసారి తెరపైకి వచ్చి పోటీకి సిద్ధమంటూ తిరిగారు. బెంగళూరు ఉత్తర టిక్కెట్ దక్కుతుందని ఎదురుచూశారు. కానీ ఒక్కసారిగా మారిన సమీకరణలతో ఉడుపి- చిక్కమగళూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రి శోభాకరంద్లాజెకు బెంగళూరు ఉత్తర అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో సదానందగౌడ పరిస్థితి సందిగ్ధంలో పడింది. వెంటనే వక్కలిగ సముదాయానికి చెందిన ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఎటువంటి నిర్ణయం తీసుకున్నా కలసి ఉంటామని వారు భరోసా ఇచ్చారు. కాంగ్రెస్‌లో చేరి బెంగళూరు ఉత్తర అభ్యర్థి కావాలనేది ఆయన ఆలోచనగా ఉంది. దశాబ్దాల కాలం ఉన్న పార్టీలోనే టిక్కెట్ దక్కకుంటే ఎన్నికల వేడిలో పార్టీ మారితే మనుగడ సాధ్యమా అనే సందేహం కూడా వెంటాడుతున్నట్లు తెలుస్తోంది. మంగళవారం నిర్ణయాన్ని ప్రకటిస్తానన్నారు. కానీ అంతలోనే వెనకడుగు వేసి సొంతూరులోని దక్షిణకన్నడ జిల్లాకు బుధవారం వెళ్లిపోయారు. ఇక ఏక్షణంలోనైనా కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ పెద్దల నుంచి చిక్కబళ్లాపుర టిక్కెట్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. రెండుసార్లు పోటీ చేసిన బెంగళూరు ఉత్తరలోనే సాధ్యం కాకుంటే కొత్త నియోజకవర్గం పైగా సొంత జిల్లా కాని చిక్కబళ్లాపురకు వెళ్లడంపై సదానందగౌడ ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది.

తెగించిన ఈశ్వరప్ప... రాజకీయమంతా ఆయనవైపే

రాష్ట్ర బీజేపీలో సీనియర్‌గానే కాకుండా హిందుత్వ ఫైర్‌బ్రాండ్‌గాను పేరొందిన ఈశ్వరప్ప పార్టీ అగ్రనేతల సూచనలను తెగించేశారు. మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా, విధానపరిషత్ ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. గడిచిన శాసనసభ ఎన్నికలలో టిక్కెట్ సాధ్యం కాదని ఢిల్లీ నేతలు తేల్చి చెప్పినా పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కుమారుడు కాంతేష్‌ను హావేరి నుంచి అభ్యర్థిగా పోటీ చేయించాలనుకున్నారు. కానీ ఇదే స్థానం నుంచి మాజీ సీఎం బసవరాజ్‌బొమ్మైను అభ్యర్థిని చేశారు. దీంతో ఒక్కసారిగా పార్టీకు రెబెల్‌గా మారారు. శివమొగ్గ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. స్వయాన ప్రధాని నరేంద్రమోదీ శివమొగ్గ ఎన్నికల ప్రచారానికి వచ్చినా దూరంగా గడిపారు. ఈశ్వరప్ప చుట్టూ రాజకీయం తిరుగుతుండటంతో హావేరి అభ్యర్థి మార్పు జరిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. లేని పక్షంలో ఆయన ఇండిపెండెంట్‌గా బరిలో దిగితే బీజేపీ అభ్యర్థి యడియూరప్ప కుమారుడు రాఘవేంద్రకు గట్టి ఎదురు దెబ్బతగలనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఖాద్రీశుడి కల్యాణం.. జగమంత వైభోగం..



శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు వధువులై, మహావిష్ణువైన ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వరుడై పెళ్లి పీటలపై కొలువు దీరగా.. చూసిన భక్తజనం పులకించి పోయారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో దేవేరులతో దేవదేవుడి కల్యాణోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా సాగింది. వేలాదిగా భక్తులు హాజరై, స్వామివారి వైభోగాన్ని క నులారా వీక్షించి, తరించారు. ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భా గంగా కల్యాణ ఘట్టం క నులపండువగా సాగింది. కల్యాణమంటడంలో మం గళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల న డుమ శ్రీవారి ప్రతిరూపం గా విచ్చేసిన కంకణ భట్టాచార్యులు.. అమ్మవార్లకు మాంగల్య ధారణ గా వించారు. స్వామి, అమ్మవార్లకు చదివింపులు చదివించి, భక్తులు బంధువులైపోయారు. నారసింహుడి బ్రహ్మోత్సవాల ప్రారంభానికి సూచికగా ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

\- కదిరి



ఊరేగింపులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

ఐదేళ్లూ గ్యారెంటీ ఉందా..?

- మీరే సీఎంగా ఉంటారని ప్రకటించే దమ్ముందా..?
- సిద్ధరామయ్యపై బీజేపీ నేతల ఎదురుదాడి







బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ అత్యంత బలహీనుడని, తనపై విమర్శలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకునే ధైర్యం కూడా ఆయనకు లేదని ఇదే సమయంలో తాను అత్యంత స్ట్రాంగ్ సీఎంనని ప్రకటించుకున్న సిద్ధరామయ్యపై బీజేపీ నేతలు ముప్పేట దాడికి దిగారు. తాను స్ట్రాంగ్ సీఎంనని చెప్పుకునే సిద్ధరామయ్యకు ఐదేళ్లపాటు తానే కొనసాగుతాననే గ్యారంటీ లేదన్నారు. సిద్ధరామయ్య లాంటి బలహీనమైన సీఎంను తాము ఇంతవరకు చూడలేదన్నారు. మోదీ ఎంత శక్తివంతుడో ప్రపంచ దేశాలు గుర్తించాయని, కాంగ్రెస్ నేతలకు మాత్రం కనువిప్పుకావడం లేదని బీజేపీ సీనియర్ నేత సీటీ రవి పేర్కొన్నారు. ఏడాది కాలంగా సీఎంగా ఉన్న ఆయనకు పాలనపై ఇంకా పట్టులభించలేదని ఎద్దేవా చేశారు. సీఎం రాజకీయ కార్యదర్శి ఒకరు అభివృద్ధి పనులకు నయాపైసా విడుదల కావడం లేదని పేర్కొన్నారని మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా మీ స్ట్రాంగ్ పాలనకు గొప్ప సర్టిఫికెట్లు ఇస్తున్నారు కదా అంటూ ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ బుజ్జగింపు రాజకీయాల ఫలితంగా శాంతి భద్రతల పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోందన్నారు. రామేశ్వరం కెఫె బాంబు పేలుళ్ల వ్యవహారం, హనుమాన్ చాలీసా పఠనం వివాదం వంటి అంశాలను ప్రస్తావించారు. సూపర్ సీఎం, షాడో సీఎం, కలెక్షన్ సీఎంల గురించి ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యమన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతుడైన ప్రధానిపై నోరు పారేసుకోవడం మంచిది కాదని సీఎంకు హితవు పలికారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని 48 గంటల పాటు నిలిపేయించి అక్కడ చిక్కుకున్న భారతీయుల్ని సురక్షితంగా మాతృదేశానికి తీసుకొచ్చారని తెలిపారు. ఖతార్‌లో మరణ శిక్షపడిన నేవీ మాజీ అధికారులను తన రాజకీయ చాణక్యంతో సురక్షితంగా విడిపించారని చెప్పారు. మోదీ నాయకత్వంలోనే తామంతా సురక్షితంగా ఉంటామని దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు విశ్వాసంతో ఉన్నారన్నారు. ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ నగరంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ తనను నోటికొచ్చినట్లు తిట్టిన ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్‌పై చర్యలు తీసుకోలేకపోయిన సిద్ధరామయ్య ఎంతటి బలిష్టమైన ముఖ్యమంత్రో తెలుస్తూనే ఉంది కదా అంటూ ఎద్దేవా చేశారు.

ప్రధాని పదవికి కాంగ్రెస్‌లో అర్హులే లేరు

- మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప



బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాని పదవికి కాంగ్రెస్‌లో అర్హులే లేరని బీజేపీ జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప వ్యాఖ్యానించారు. పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఇండియా కూటమి పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలతో కూడిన జట్టు అన్నారు. కూటమి నుంచి ఒక్కొక్కరే మెల్లగా జారుకుంటున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కూటమి ఛిన్నాభిన్నం కావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అభ్యర్థులే కరువయ్యారని, అందుకే బీజేపీలోని అ సంతృప్త నేతలకు గాలం వేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. జేడీఎస్‌తో పొత్తు కారణంగా మొత్తం 28 నియోజకవర్గాల్లోనూ క్లీన్‌స్వీప్ చేయబోతున్నామని ఆయన జోస్యం చెప్పారు. మాజీ ఉపముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్ప తనపై చేస్తున్న ఆరోపణలపై స్పందించేందుకు యడియూరప్ప నిరాకరించారు. అధిష్టానం పెద్దలు ఇప్పటికే ఈశ్వరప్పను బుజ్జగించే పనిలో ఉన్నారన్నారు. ఆయన కుమారుడు కాంతేష్‌కు టిక్కెట్ దక్కకపోవడానికి తానే కారణమని అపోహ పడుతున్నారని, త్వరలోనే నిజానిజాలు తెలుస్తాయన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో తాను ఎక్కడా జోక్యం చేసుకోలేదని, పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ నిర్ణయాలు తీసుకుందని యడియూరప్ప పేర్కొన్నారు. అసంతృప్తితో రగిలిపోతున్న మాజీ మంత్రి జేసీ మాధుస్వామి, ఎంపీ రేణుకాచార్య తదితరులతో తాను మా ట్లాడి సముదాయిస్తానని చెప్పారు. ఆవేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, టిక్కెట్లు ఇవ్వలేకపోయిన వారి సేవలను పార్టీ తప్పకుండా వినియోగించుకుని సముచిత పదవులు ఇస్తుందని తెలిపారు. జేడీఎస్‌తో పొత్తుకు సంబంధించి ఎలాంటి సమస్యల్లేవని ఆయన తెలిపారు.

డీవీఎస్ పార్టీ వీడబోరు...

మీడియాలో వెలువడుతున్న కథనాల మేరకు మాజీ ముఖ్యమంత్రి డీవీ సదానందగౌడ కాంగ్రెస్‌లో చేరబోరని బెంగళూరు ఉత్తర జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎస్.హరీష్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలో బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సదానందగౌడ సంఘ్ పరివార్ నుంచి వచ్చారని, ఆయన అత్యంత క్రమశిక్షణ కలిగిన నేత అని పేర్కొన్నారు. మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ సైతం కాంగ్రెస్‌కు వెళ్లినా అక్కడ ఇమడలేకపోయారని గుర్తుచేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను విశ్వసించవద్దని పార్టీ కార్యకర్తలను కోరారు.

ఆలయాల బిల్లుకు గవర్నర్ తిరస్కరణ

- ఇతర ధార్మిక సంస్థలను కూడా చేర్చుతారా అని సందేహం

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆలయాల హుండీల ద్వారా వచ్చే ఆదాయాన్ని సద్వినియోగం చేసుకునేలా ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన ప్రత్యేక బిల్లును మంగళవారం గవర్నర్ తిరస్కరించారు. శాసనసభలో ఆమోదించిన బిల్లు ఆమోదం కోసం ప్రభుత్వం రాజ్‌భవన్‌కు పంపింది. పరిశీలించిన గవర్నర్ థావర చంద్ గెహ్లోట్ సదరు బిల్లును తిరస్కరించి సమగ్ర వివరణలు కోరడంతో పాటు పలు సందేహాలను లేవనెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదాయాన్ని బట్టి ఏ,బీ,సీ గ్రేడ్‌లుగా నిర్ణయించారు. ఏ, బీ గ్రేడ్ ఆలయాలకు హుండీలతో పాటు ఇతరత్రా భారీగా ఆదాయం చేకూరనుంది. హుండీల ద్వారా కోటికి పైగా ఆదాయం వచ్చే ఆలయాల నుంచి 10శాతం, కోటికి లోపుగా ఆదాయం వచ్చే ఆలయాల నుంచి ఐదు శాతం నిధులను సీ గ్రేడ్ ఆలయాల అభివృద్ధికి వినియోగించేలా దేవదాయ శాఖ బిల్లును సవరించారు. అనేక సందేహాలు వ్యక్తం చేస్తూ గవర్నర్ బిల్లును వాపసు పంపారు. కాగా హిందూ ఆలయాలకు సంబంధించి చేసిన సవరణ బిల్లును ఇతర ధార్మిక సంస్థలకు అన్వయింపచేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా అనే విషయాన్ని గవర్నర్ ప్రశ్నించారు. వాపసు పంపిన బిల్లులో ఈ అంశాన్ని పొందుపరచారు. రాష్ట్రంలో సీ గ్రేడ్‌లో ఉండే 34వేల ఆలయాల అభివృద్ధి, అర్చకులకు బీమా వంటి సౌలభ్యాలు కల్పించదలచినట్లు ప్రభుత్వం పంపిన బిల్లులో పొందుపరచారు.



ఇఫ్తార్	: గురువారం సాయంత్రం 06:32
సెహరి	: శుక్రవారం ఉదయం 05:11

తమిళులకు శోభాకరంద్లాజె క్షమాపణ

- రామేశ్వరం కెఫె పేలుళ్లపై వివాదాస్పద వ్యాఖ్యలు
- కేంద్ర ఎన్నికల సంఘానికి డీఎంకే ఫిర్యాదు




బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫె బాంబు పేలుడు ఘటనపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి, బెంగళూరు నార్త్ బీజేపీ అభ్యర్థి శోభాకరంద్లాజె బుధవారం క్షమాపణలు చెప్పారు. కృష్ణగిరి అడవుల్లో తర్ఫీదు పొందిన వ్యక్తే బాంబు పేలుళ్లకు కారకుడంటూ ఇటీవల శోభాకరంద్లాజె చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమయింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి శోభా తమిళనాడు ప్రజలకు క్షమాపణలు చెప్పారు. సమాచార లోపం వల్లే తాను అలాంటి వ్యాఖ్యలను చేశానని, తన వ్యాఖ్యలు తమిళ సోదరుల మనసును నొప్పించి ఉంటే క్షమించాలని, తన వ్యాఖ్యలను పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నాని ఆమె ప్రకటించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అనుసరిస్తున్న బుజ్జగింపు రాజకీయాల కారణంగానే హిందువులపై, బీజేపీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. కేంద్రమంత్రి శోభాపై కేంద్ర ఎన్నికల సంఘానికి డీఎంకే ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే ఆమె క్షమాపణలు చెప్పడం గమనార్హం. మరో వైపు బెంగళూరు నగరత్‌పేటలో మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన బెంగళూరు బీజేపీ అభ్యర్థి తేజస్వి సూర్యపై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ బుధవారం ఫిర్యాదు చేసింది. మీడియాలో వచ్చిన క్లిప్పింగ్‌లను కూడా ఫిర్యాదుతో పాటు జతచేసినట్లు బెంగళూరు నగర కాంగ్రెస్ నేత వై.పుట్టరాజు పేర్కొన్నారు. తేజస్విసూర్య వ్యాఖ్యలు మత ఘర్షణలు సృష్టించేవిలా ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం వెంటనే స్పందించి ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని, చట్టపరంగా ఆయనపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ తన ఫిర్యాదులో డిమాండ్ చేసింది. ఓటమి భయంతోనే బీజేపీ బెంగళూరులో మత విద్వేషాల అజెండాను తెరపైకి తెచ్చిందని, తద్వారా రాజకీయ లబ్ధికోసం నీచానికి ఒడిగడుతోందని, సమాజంలో శాంతి సామరస్యాలను దెబ్బతీసి పబ్బం గడుపుకోవాలని చూస్తోందని పౌర ఆహార సరఫరాల శాఖ మంత్రి దినేష్ గుండూరావు బుధవారం మీడియాకు చెప్పారు. సమాజంలో చిచ్చురేపేందుకు ఏ చిన్న ఘటన జరిగినా బీజేపీ నేతలు డేగల్లా వాలిపోతుంటారని ఆయన విరుచుకుపడ్డారు. స్థానిక యువకుల మధ్య జరిగిన గొడవకు మతం రంగు పూసే ప్రయత్నం జరిగిందని ఆయన ఆరోపించారు. శాంతి సామరస్యాలు దెబ్బతీసేందుకు ఎవరు ప్రయత్నించినా చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.

గతాన్ని మరిచిపోయారా..?

- జేడీఎస్ నేతలను పీఎం, సీఎంని చేసిన ఘనత మాదే : కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి డీకే సురేశ్

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పై నిప్పులు చెరుగుతున్న జేడీఎస్ నేతలు ఒక్కసారి గతాన్ని గుర్తు చేసుకుంటే మంచిదని పార్టీ ఎంపీ, బెంగళూరు గ్రామీణ లోక్‌సభ అభ్యర్థి డీకే సురేశ్ మండిపడ్డారు. నగరంలోని సదాశివనగర్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని పీఠంపై రైతుబిడ్డ హెచ్‌డీ దేవెగౌడను కూర్చోబెట్టామని, వేళ్లపై లెక్కపెట్టే సీట్లు గెలిచిన జేడీఎస్‌కు అప్పట్లో కాంగ్రెస్ తీసుకున్న చొరవ కారణంగానే ఈ అవకాశం వచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో డబుల్ డిజిట్ సీట్లు గెలిచినా కుమారస్వామికి ముఖ్యమంత్రి స్థానం అప్పగించామని ఈ విషయాలన్నింటినీ జేడీఎస్ మర్చిపోయి ఇప్పుడు తన లౌకిక ముసుగును కూడా తీసిపారేసి మతతత్వ బీజేపీతో అంటకాగుతోందని ఆయన ఎద్దేవా చేశారు. సుదీర్ఘ రాజకీయ పోరాటాలు చేసిన ఆ పార్టీ పెద్దలు రెండు మూడు సీట్ల కోసం ఢిల్లీ బీజేపీ పెద్దల ముందు మోకరిల్లారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో గతంలో జేడీఎస్‌తో పొత్తు కారణంగానే బీజేపీ వేళ్లూనుకుందని, ఇది తన జీవితంలో చేసిన ఘోరమైన తప్పిదమని అప్పట్లో వ్యాఖ్యానించిన దేవెగౌడ ఇప్పుడు బీజేపీతో తమ సంబంధం జన్మజన్మల అనుబంధం అంటూ కూనిరాగాలు తీస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. అధికారం కోసం సిద్ధాంతాలను సైతం పక్కన పెట్టే నైజం జేడీఎస్‌కు వెన్నతో పెట్టిన విద్యగా ఉందన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.33	1,594.20
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	1660
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	765	9,125
సామర్థ్యం (టీఎంసీలు)	5.70	14.90

కారు బోల్తా.. ఇద్దరి మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బళ్లారి సిటీ, మార్చి 20: బెంగళూరు నుంచి అమీనుగాడ్‌కు బయలు దేరిన కారు డ్రైవర్ అదుపు తప్పి పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. బెంగళూరు నుంచి తమ స్వగ్రామమైన అమీనుగాడ్ నగర్‌లోని లంబానీ తాండాకు నలుగురు వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున కారులోబయలుదేరారు. సివిల్‌ఇంజనీర్ అయిన డ్రైవర్ రాజు అతివేగంగా కారు నడుపుతున్నాడు. కూడ్లిగి సమీపంలోని మొరల క్రాస్‌లో కారు డ్రైవర్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో బాగల్‌కోట జిల్లా హనుగుంద తాలూకాకు చెందిన కిరణ్ (17) అక్కడికక్కడే మృతి చెందగా, కారు డ్రైవర్ రాజు(36) తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అలాగే విద్యార్థి అభిషేక్(17), మరో విద్యార్థి అప్పు చౌహాన్(23) తీవ్రంగా గాయపడడంతో కూడ్లిగి ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు. విషయం తెలిసినవెంటనే కూడ్లిగిపోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

బీజేపీ నేత వీరంగం

బళ్లారి సిటీ, మార్చి 20: బీజేపీకి కురుబ సంఘం నాయకులు అవసరం లేదా అని స్థానిక నేత రామలింగప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన 'బూత్ విజయ్ అభియాన్' సమావేశంలో రామలింగప్ప ప్రసంగిస్తూ పోడియం బ్యానర్‌పై తన చిత్రపటం లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇదంతా జిల్లా శాఖ అధ్యక్షుడు గమనించాలని, వేదికపై ఉన్న అనిల్‌కుమార్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమ సొసైటీకి ఒక్కో నియోజకవర్గంలో 30వేల ఓట్లు ఉన్నాయన్నారు. ఆవేశంగా మాట్లాడుతున్న రామలింగప్ప వేదికపై నుంచి వెళ్లిపోగా స్థానిక నాయకులు వెళ్లి ఆయనను వెనక్కు తీసుకొచ్చారు

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అధికారులు

కంప్లి, మార్చి 20: రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పలు చోట్ల పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. నోడల్ ఆఫీసర్ (కమ్యూనికేషన్ అరేంజ్‌మెంట్) శ్రీకంఠస్వామి బుధవారం కంప్లిలో 36, 37 పోలింగ్ బూత్‌లను, ఉప్పరహళ్లి ఏసీ 31 కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 36, 37, ఏసీ 31 పోలింగ్ కేంద్రాల్లో నెట్‌వర్క్ ప్రాబ్లమ్, పోలింగ్ స్టేషన్‌లు దృష్టికి రావడంతో వాటిని పరిశీలించామన్నారు. ఎన్నికలలోపుగానే ఈ సమస్య కూడా తీర్చి ఈ పోలింగ్ కేంద్రంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ అభిషేక్, హెచ్ఎం రేవన్న, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నోటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సిరుగుప్ప, మార్చి 20: నోటి వ్యాదులపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని సిరుగుప్ప తాలుకా డెంటల్ వైద్యాధికారి డాక్టర్ పవన్ శర్మ తెలిపారు. సిరుగుప్ప పట్టణ ప్రభుత్వాస్పత్రిలోబుధవారం నోటి వ్యాధుల నివారణపై శిబిరం జరిగింది. కార్యక్రమంలో డెంటల్ వైద్యులు డాక్టర్ పవన్ శర్మ మాట్లాడుతూ పిల్లలు నోట్లో వేలుపెట్టుకోవడం, గోర్లను కత్తిరించుకోవడం లాంటి పద్ధతులు సరైనవి కావని తెలిపారు. గుట్కాలు సేవించడం మానుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పళ్లను, నోటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా వుంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బంది, రోగులు, ప్రజలు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో ఐదు చెక్‌పోస్టుల ఏర్పాటు

సిరుగుప్ప, మార్చి 20: లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలలో అక్రమ రవాణాను అరికట్టడం కోసం ఐదు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు సిరుగుప్ప తాలుకా ఎన్నికల అధికారి షంషాలం తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తాలుకాలోని ఇబ్రహీంపురం సరిహద్దు ప్రాంతాలలో ఇటిగేహాళ్, మాడసూగూరు, బెళగల్ గ్రామాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

వైభవంగా మల్లప్ప, బసవేశ్వరస్వామి రథోత్సవాలు




బండ్రి గ్రామంలో సాగుతున్న బైలూరు మల్లప్ప తాత, బసవేశ్వరస్వామి రథోత్సవాలు

కంప్లి నియోజకవర్గంలోని బండ్రి గ్రామంలో బైలూరు మల్లప్ప తాత, బండ్రి బసవేశ్వర స్వామి రథోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి.. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే పల్లకి సేవ కూడా నిర్వహించారు. గ్రామాల్లో మహిళలకు ఒడినింపే కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి యేటా ఈ రథోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించుకుంటామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆలయం నుంచి గ్రామంలోని ఎదురు బసవన్న కట్ట వరకు ఊరేగింపు నిర్వహించారు. ✍ కంప్లి

ఈసారైనా భారీ మెజారిటీతో గెలిపించండి

● బూత్ సమావేశంలో కార్యకర్తలకు శ్రీరాములు విజ్ఞప్తి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అభ్యర్థి శ్రీరాములు తదితరులు

బళ్లారి సిటీ, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ బళ్లారి లోక్‌సభ అభ్యర్థి శ్రీరాములు కోరారు. బళ్లారి నగరం తాళూరులో రోడ్డులోని గోవిందప్ప కల్యాణ మంటపంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల బూత్ సమావేశంలో ఆయనతోపాటు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ కార్యకర్తలనుండి నగర ప్రముఖులు యువకులు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొని తనను అత్యంత ఎక్కువ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తనను గెలిపించడం ద్వారా మోదీని హ్యాట్రిక్ ప్రధానిగా చేయాలన్నారు. 35 సంవత్సరాల నుంచి అన్ని వర్గాలవారు కలిసి తనను పెద్దస్థానంలో నిలిపారన్నారు. గత ఎన్నికల్లో ఏవో కారణాల వల్ల ఓటమి పాలయ్యానని, తన నుంచి కూడా తప్పుజరిగి ఉండవచ్చన్నారు. దానిని మనసులో పెట్టుకోకుండా ఈసారి ఎన్నికల్లో గెలిపించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలకు త్రాగునీరు అందడంలేదని, చెళ్లగుర్కి, కగ్గల్లు, వీరాపురం, జానెకుంటె, తదితర గ్రామాలు తాగు నీటి సమస్యతో సతమతమవుతున్నాయన్నారు. తనను గెలిపిస్తే ఈసమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రముఖులు రవికుమార్, విధాన పరిషత్ సభ్యులు ఎం.సతీశ్, ప్రముఖులైనా మహిపాల్, రామలింగప్ప, విరూపాక్షగౌడ, గోనాల్ మురహరి గౌడ, గురలింగనగౌడ, గుత్తిగనూరు విరుపాక్షగౌడ, వీరశేఖర్‌రెడ్డి, హనుమంతప్పపిడీ హళ్ళి వాల్మీకి అధ్యక్షులు జానార్దన్ నాయక్ పాల్గొన్నారు.

నగరవాసులకు ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

బళ్లారి/రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర వాసులకు దాహం తీర్చేందుకు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ముందుకొచ్చారు. టచ్ ఫర్ లైఫ్ అనే సేవాసంస్థ ద్వారా నగరంలో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీరు అందించే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు హుసేన్ పీరా, కాంగ్రెస్ నాయకుడు అభిలాష్, కన్నడ రక్షణవేదిక జిల్లా అధ్యక్షుడు చానల్ శేఖర్, చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక సంగనకల్లు రోడ్డులోని నలంద పాఠశాల మైదానం నుంచి ట్యాంకర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రస్తుతం నగరంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, రిజర్వాయర్లలో కూడా నీరు లేకుండా పోయిందని, దీన్నిదృష్టిలో ఉంచుకుని బళ్లారి ప్రజల తాగునీరు అవసరాలు తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా అందిస్తామని తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో వీరితో పాటు కాంగ్రెస్ నాయకులు వన్నప్ప, హగరి గోవింద, అఖిలభారత వీరశైవ మహాసభ జిల్లా అధ్యక్షుడు చానల్ శేఖర్, ఎస్డీడీ మంజు, అర్షద్, మోకా నాగరాజు, విశ్వనాథ్ నాయక్, సీనా, అశోక్‌రెడ్డి, బెనకల్లు రఘు, కే. శివకుమార్, శివుడు పాల్గొన్నారు.



తాగునీరు అందించేందుకు సిద్ధం చేసిన ట్యాంకర్లు



ట్యాంకర్లను ప్రారంభిస్తున్న ప్రముఖులు

కరువు ప్రభావంతో పెరిగిన వలసలు.. ఓటింగ్ తగ్గే ప్రమాదం

బళ్లారి సిటీ, మార్చి 20: జిల్లాలో కరువు ప్రభావం కారణంగా ఓటింగ్ తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే మే 7న ఓటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో నెలన్నర పాటు అభ్యర్థులకు ప్రచారం చేసే అవకాశం లభించింది. కాని గత ఏడాది కాలంగా రాష్ట్రంలో కరువు నెలకొని ఉండడంతో ఉపాధి వెతుక్కుంటూ జనం వలస బాట పట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఓ వైపు రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. మరోవైపు జిల్లాయంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైంది. పోలింగ్‌లో పాల్గొనవలసిన ప్రజలు వలస పోవడంతో ఏంచేయాలో తెలియక అధికారులు జుట్టుపీక్కుంటున్నారు. ఓటర్ల సంఖ్యను పెంచేందుకు స్వీప్ ద్వారా పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని యోచిస్తున్నారు. కరువు బారిన పడిన వారిని సంప్రదించి ఎలాగైన ఓటు వేయడానికి రావాలని కోరేందుకు కృషి చేస్తున్నారు.



ఉపాధి పనులకోసం వలసబాటపట్టిన ప్రజలు (ఫైల్)

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



మారుతీనగర్ గిడ్డంగుల కేంద్రం వద్ద జొన్నల కొనుగోలును ప్రారంభించిన అధికారి

కంప్లి, మార్చి 20 : ఎట్టకేలకు గిడ్డంగుల శాఖ జొన్నల కొనుగోలుకు ముందుకొచ్చింది. మారుతీనగర్ (సీపిరిదిన్ని) గిడ్డంగుల కేంద్రం వద్ద బుధవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. క్వింటాల్‌కు రూ. 3180లు మద్దతు ధర నిర్ణయించగా, ఇప్పటికే 1111 మంది రైతులు వారి పేర్లను నమోదు చేసుకున్నట్లు కొనుగోలు కేంద్రం అధికారి రంగప్ప తెలిపారు. 20 క్వింటాళ్లకు పైగా వున్నట్లయితే తమ వాహనమే రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంప్లితో పాటు ఎమ్మిగనూరు, నెల్లూడి, రామసాగర, చిన్నజాగనూరు, మెట్రి, దేవసముద్రం, జవుకు, జానూరు తదితర గ్రామాలు రబీలో పండించిన జొన్నలను గిడ్డంగుల కేంద్రంలో విక్రయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ ఆసిఫ్ ఖలీ, శివప్ప, గిడ్డంగుల వ్యవస్థాపకురాలు అనుపమ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఖాసీమ్ సాబ్, రైతులు వూవన్న, రేణుకానంద, మంజునాథ, నెల్లూడి వన్నూరుసాబ్, జడెప్ప, ఆదిమనె గుండయ్య, గాదెప్ప, నగరూరు సూగప్ప, నాగరాజు పాల్గొన్నారు.

అమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదానం



మహిళకు రక్తదానం చేసిన అమ్మ ట్రస్టు సభ్యులు

బళ్లారిరూరల్, మార్చి 20: బళ్లారి నగరంలో ఓ మహిళ మంగళవారం ఆపరేషన్ సందర్భంగా రక్తం కావాలని అమ్మట్రస్టుకు కాల్ చేయగానే వెంటనే ట్రస్టులో వుండే యువకులు విమ్స్ హాస్పిటల్‌కు చేరుకుని రక్తదానం చేశారు. అమ్మ ట్రస్టు సభ్యులు అభిషేక్ మాట్లాడుతూ ఎవరైనా రక్తం కావాలని అమ్మ ట్రస్టుకు ఫోన్ చేస్తే తమ సంస్థ నుంచి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి 15 నిమిషాల్లో ఎవరో ఒకరు వచ్చిరక్తదానం చేస్తామని తెలిపారు.

వినియోగదారుల్లో చైతన్యం అవసరం



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, మార్చి 20: వినియోగదారులు హక్కులపై చైతన్యాన్ని పెంచుకోవాలని జిల్లాలీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ జడ్జి రాజేశ్ హొసమనె అన్నారు. జిల్లాలీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీ మేధా విద్యాలయం హాల్లో బుధవారం 'క్వాలిటీ అండ్ రెస్పాన్సిబుల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' నినాదంతో వినియోగదారుల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక సాంకేతికతతో అభివృద్ధి చెందుతున్న మనం దానికి అనుగుణంగా మారడం అత్యవసరమన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసే వస్తువుల నాణ్యత, పరిమాణంపై వినియోగదారులు శ్రద్ధ వహించాలని ఆయన కోరారు. రానున్న రోజుల్లో వ్యాపారులు, వినియోగదారుల మధ్య జరిగే మోసాలను అరికట్టేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్నపుడు మానవ రహిత యంత్రాలు పనిచేసే వాతావరణం సృష్టించబడుతుందని, వీటిని సక్రమంగా నిర్వహించాలని, లేని పక్షంలో ప్రాణాపాయం తప్పదని ఆయన తెలిపారు. ఈసందర్భంగా జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ మహిళా సభ్యురాలు మర్ల శశికళ, జిల్లా బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎర్రిగౌడ, న్యాయవాది అంకాలయ్య, మేధా కాలేజ్ ప్రిన్సిపాల్ రామకిరణ, సబ్సిడీ ధరల దుకాణ యజమానులు పాల్గొన్నారు.

కుడితిని-బళ్లారి ప్రత్యేక బస్సు సర్వీసు ప్రారంభం

కంప్లి, మార్చి 20: కుడితిని నుంచి బళ్లారికి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు కేఎస్‌ఆర్టీసీ ముందుకొచ్చింది. గతంలో కర్ణాటక రక్షణ వేదిక కుడితిని పదాధికారులు భావి శివకుమార్, రక్షణ వేదిక కావలుపడ అధ్యక్షులు తిమ్మప్ప, కేఎస్‌ఆర్టీసీ డీసీ భగవాన్, డీటీవో శ్యామరాజుకు విద్యార్థుల సమస్యలపై మనవిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు బుధవారం ఉదయం బళ్లారి నుంచి కుడితినికి బస్సు పంపారు. రక్షణ వేదిక పదాధికారులు ఈ సర్వీసును ప్రారంభించారు. కేఎస్‌ఆర్టీసీ అధికారులకు రక్షణ వేదిక అభినందనలు తెలిపారు.



బస్సును ప్రారంభిస్తున్న పదాధికారులు

హొసూరు జోన్

పెరిగిన నిమ్మ, దోసకాయల ధరలు

ఆనందంలో హొసూరు రైతులు



హొసూరు(సిఫ్‌కాట్) మార్చి 20 : వేసవి ఎండల ప్రభావంతో హొసూరులో నిమ్మ, దోసకాయల ధరలు పెరిగాయి. దీంతో రైతుల్లో ఆనందం నెలకొంది. హొసూరులో వేసవి కాలం ప్రారంభం కాక ముందే ఎండ వేడిమి ఎక్కువగా ఉండేది. పానీయాల కోసం ప్రజలు నిమ్మకాయలు, దోసకాయలను కొనుగోలు చేయడంతో వాటికి డిమాండ్ పెరిగింది. సాధారణంగా హొసూరు రైతు బజారుకు రోజూ టన్ను నిమ్మకాయలు వచ్చేవి. కానీ ఇప్పుడు దిగుబడి తగ్గడంతో అరటన్ను నిమ్మకాయలు మాత్రమే వస్తున్నాయి. ఇలా సరఫరా తగ్గడంతో కిలో నిమ్మకాయలు రూ.60 నుంచి రూ.120కి పెంచి విక్రయిస్తున్నారు. అదే విధంగా హొసూరు చుట్టు ప్రక్కల రైతులు ప్రతిరోజు రైతు బజారుకు 2 టన్నుల వరకు దోసకాయలు తీసుకువచ్చేవారు. ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో 5 టన్నుల వరకు విక్రయిస్తున్నారు. అదే విదంగా ఇంతకు ముందు కీరదోస రూ.10 ఉండేది. ప్రస్తుతం రూ.30 కు విక్రయిస్తున్నారు. నిమ్మ, కీరదోస ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో ఫస్ట్ గ్రేడ్, సెకెండ్ గ్రేడ్ అని పండ్లను విభజించి విక్రయిస్తున్నారు.

కృష్ణగిరి లోక్‌సభ అభ్యర్థిగా తెలుగు తేజం



అన్నాడీఎంకే జయప్రకాశ్

హొసూరు మార్చి 20 : కృష్ణగిరి లోక్‌సభ అన్నాడీఎంకే అభ్యర్థిగా తెలుగు యువగళం జయప్రకాశ్‌ను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. జయలలిత, కరుణానిధి మృతి తర్వాత అభ్యర్థులను ఎంపిక చేయడంలో రెండుపార్టీలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఇందులో అన్నాడీఎంకే పార్టీ 16 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఎక్కువగా అన్నాడీఎంకేలో యువనాయకులకు స్థానం కల్పించాలని పార్టీ కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి యడపాడి పళనిస్వామి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇంతకు ముందు కృష్ణగిరి లోకసభ స్థానం కాంగ్రెస్ నాయకులే పరిపాలించారు. ఇటీవల కాలంలో జాతీయ వాదం లేక పోవడంతో జిల్లాలో తెలుగు భాష దెబ్బతింది. ఎన్ని పోరాటాలు చేసినా స్థానిక పార్టీలు ఏది పట్టించుకోలేదు. తర్వాత మొదటి సారిగా యువనేత జయప్రకాశ్‌కు స్థానం లభించడంతో తెలుగు అభిమానులు సంతోషించి అభినందనలు తెలుపుతున్నారు. తెలుగు భాషాభివృద్దికి జిల్లాలో ఆయన వెన్నంటి ఉంటారని, గట్టి నమ్మకంతో తెలుగు భాషాభిమానులు ఆశగా ఉన్నారు. హొసూరు ప్రాంతానికి చెందిన ఆయన ఈ మూడు నియోజక వర్గాలలో ఆయనను అభిమానించే తెలుగు, కన్నడ వారు ఎందరో ఉన్నారు.

సింహ వాహనంపై మరగదాంబ చంద్రచూడేశ్వరల ఊరేగింపు

హొసూరు(సిఫ్‌కాట్) మార్చి 20 : హొసూరు చంద్రచూడేశ్వర స్వామి మంగళవారం రాత్రి సింహవాహనంపై ఊరేగారు. ఉత్సవం సందర్భంగా ప్రధాన గురువులు వాచీశ్వరన్ ప్రత్యేక పూజలు నిర్వహించి రథంపై అమ్మ భవానీని ఊరేగింపుగా తీసుకుని తేరుపేట మొత్తం చుట్టి వచ్చారు. వేలాది మంది ప్రజలు, తేరుపేట ప్రజలు, హొసూరు ప్రాంతానికి చెందిన భక్తులు పాల్గొన్నారు. అందరు కలుసుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.



సింహవాహనంపై శ్రీ మరగదాంబ చంద్రచూడేశ్వరల ఊరేగింపు

రాయచూరు అభ్యర్థులపై తొలగని సందిగ్ధం




మాజీ ఎంపీ బీవీ నాయక్, సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్

రాయచూరు, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల్లో రాయచూరు స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక పై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రెండు ప్రధాన పార్టీలైన బీజేపీ-కాంగ్రెస్ ఇప్పటికి అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ఆ రెండు పార్టీల జిల్లా స్థాయి నాయకులు, శ్రేణులకు ఎదురు చూపులు తప్పడం లేదు. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ స్థానంలో మాజీ ఎంపీ బీవీ నాయక్ పేరు ఖరారైందని కొంత మంది సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటున్నా దాన్ని పార్టీ వర్గాలు ధ్రువీకరించడం లేదు. అధికారికంగా రాష్ట్ర జాతీయ నాయకత్వం ప్రకటిస్తే గాని అభ్యర్థి ఎవ్వరన్నదాని పై స్పష్టతరాదని ఆ పార్టీకి చెందిన నాయకులు చెబుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలోను ఇదే రకమైన పరిస్థితి తలెత్తింది. కాంగ్రెస్ తరపున రాయచూరు స్థానం నుంచి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీ కుమార్ నాయక్ బరిలో ఉంటారని ఇప్పటికే ఆయన పేరు ఖరారైందంటూ పార్టీ వర్గాలు ప్రచారం చేస్తుండగా మరికొందరు దాన్ని ఖండిస్తున్నారు. పీసీసీ నాయకత్వం ప్రకటించే వరకు అభ్యర్థి ఎవ్వరన్నది స్పష్టత ఉండదంటున్నారు. కేవలం సోషల్ మీడియా ద్వారా వారి మద్దతుదారులు మాత్రమే ఇలాంటి ప్రచారాలు చేసుకుంటున్నారని వారంటున్నారు. కాగా బీజేపీ ఈనెల 22వ తేదీన జాబితాను ప్రకటించే అవకాశం ఉండడంతో అదేరోజు రాయచూరు స్థానానికి సంబంధించిన అభ్యర్థి పేరు కూడా వెలువడే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికి స్పష్టత రాలేదు. బీజేపీ అభ్యర్థిత్వాన్ని మాజీ ఎంపీ బీవీ నాయక్‌కు ఇచ్చేందుకు పార్టీ సుముఖంగా ఉన్నా కొంత మంది కిందిస్థాయి నాయకులు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తుండడంతో బీజేపీలో సందిగ్ధత ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కుమార్‌నాయక్ పేరు కాంగ్రెస్ పార్టీలో ఖరారైందని చెప్పినా ఆయన ఇప్పటికి పార్టీలో చేరలేదని అవి కేవలం ఊహాగానాలు మాత్రమేనని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నారు. దీంతో ఎన్నికల బరిలో ఉండే ప్రధాన పార్టీల్లో అభ్యర్థి ఎవ్వరన్నది ఇప్పటికి సస్పెన్స్‌గానే మిగిలిపోయింది.



కుమార్ నాయక్

వాహన రాకపోకలపై నిఘా ఉంచాలి: ఎస్పీ నిఖిల్

రాయచూరు, మార్చి 20: ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే వాహనాలను తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ బి.నిఖిల్ ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో విధి విధానాల గురించి అధికారులు స్పష్టంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. బుధవారం జిల్లా సరిహద్దులోని అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టును ఎస్పీ తనిఖీ చేశారు. ఇడపనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏపీ సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించిన ఎస్పీ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. నగదు రవాణ జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఎంఆర్ అప్పారావు (జయంతి)



ఎంఆర్ అప్పారావుగా పేరొందిన నూజివీడు జమీందారీ కుటుంబానికి చెందిన ఈయన పూర్తిపేరు మేకా రంగయ్య అప్పారావు విద్యావేత్త, మాజీ మంత్రి. 1915 మార్చి 21న కృష్ణాజిల్లా నూజివీడు గ్రామంలో జన్మించారు. నూజివీడు నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో సేవలందించారు. ఆ తర్వాత రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1989లో ఒకసారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓటమి చెందారు. టెన్నిస్ క్రీడాకారుడిగాను రాణించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా వ్య వహరించారు. 2003 జనవరి 31న కన్ను మూశారు.

ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ (జయంతి)



భారతరత్న గ్రహీత ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ సాహెబ్ 1916 మార్చి 21న బీహార్ రాష్ట్ర డుమ్రావ్ పట్టణంలో జన్మించారు. షెహనాయ్ వాద్యాన్ని సాంప్రదాయ వేడుకలు, ఉత్సవాల నుంచి కచేరి స్థాయికి తీసుకెళ్లిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఎంఎస్ సుబ్బలక్ష్మి, రవిశంకర్‌ల తర్వాత సాంప్రదాయ సంగీత విద్వాంసులలో 'భారతరత్న' పొందిన మూడోవ్యక్తి బిస్మిల్లాఖాన్. 'నేను మహమ్మదీయుడైనను సరస్వతీదేవి ఆరాధకుడను, ఆమెను తలవనిదే నారోజు ఆరంభం కాదు, సంగీతానికి భాషా భేదాలు లేవు, నా దేశ ప్రజలు తమ ఇంటి సభ్యుడిగా ఆదరించార'ని చెప్పిన మహాదేశభక్తుడు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ సహా సంగీత నాటక అకాడమీ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2006 ఆగస్టు 21న కన్నుమూశారు. వారణాసిలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

మాతా నిర్మలాదేవి (జయంతి)



శ్రీ మాతాజీ నిర్మలాదేవి 1923 మార్చి 21న మధ్యప్రదేశ్ రాష్ట్రం చింద్వారా ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు నిర్మలా శ్రీవాత్సవ. ధార్మిక ఉద్యమంలో పేరొందిన 'సహజ యోగ' సంస్థాపకురాలు. క్రమం తప్పని ధ్యానం, యోగాల ద్వారా చక్కటి ఆరోగ్యం సాధ్యమని ఆచరించి చూపారు. ప్రజలను ఎంతో చైతన్యం చేశారు. ఢిల్లీలో విశ్వనిర్మల ప్రేమ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. నాగపూర్‌లో ఒక సంగీత పాఠశాలను ఏర్పాటు చేశారు. చైనా దేశం తరఫున ఐక్యరాజ్యసమితి మహిళా సదస్సులో ప్రసంగించారు. పలు గౌరవాలు అందుకున్నారు. 2011 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

నటరాజ రామకృష్ణ (జయంతి)



'నటరాజ'రామకృష్ణ 1933 మార్చి 21న ఇండోనేషియా దేశం బాలి ప్రాంతంలో జన్మించారు. తల్లిదండ్రులు నల్గొండ జిల్లా, తూర్పు గోదావరి జిల్లాలకు చెందినవారు. కూచిపూడి నాట్య కళాకారుడు. ఆంధ్ర నాట్యము, పేరిణీ తాండవము, నవజనార్థనం వంటి ప్రాచీన నాట్యరీతుల్ని తిరిగి వెలుగులోకి తెచ్చారు. కళలను పోషించేందుకు ఆజన్మబ్రహ్మచారిగానే ఉండిపోయారు. 18వ యేట నాగపూర్‌లో ఆయనకు'నటరాజ' బిరుదును ప్రదానం చేశారు. పద్మశ్రీ, కళాప్రపూర్ణ తదితర గౌరవాలు అందుకున్నారు. 2011 జూన్ 7న కన్నుమూశారు.

సుధారాణి రఘుపతి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత సుధారాణి రఘుపతి 1944 మార్చి 21న తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి ప్రాంతంలో జన్మించారు. భరతనాట్య కళాకారిణిగా రాణించారు. అమెరికా దేశం వర్జీనియాలోని రాండల్ఫ్ మాకన్స్ ఉమెన్స్ కళాశాల నుంచి సోషియాలజీ అండ్ ఫిలాసఫీలో 1964-65లో తొలి ఇండియన్ గ్రాడ్యుయేట్ కావడం విశేషం. భరతనాట్యంపై రచనలు కూడా చేశారు. ఐక్యరాజ్యసమితి తరఫున 1981లో వరల్డ్ హ్యూమన్ రైట్స్ డే వేదికపై నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. ఇన్‌స్టిట్యూట్ ద్వారా మూడు దశాబ్దాలుగా నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. సంగీత నాటక అకాడమీ, కలైమామణి, సప్తగిరి సంగీత విద్వన్మణి తదితర అవార్డులు పొందారు.

శోభన (పుట్టినరోజు)



నాట్యంలోనూ, నటనలోనూ ప్రసిద్ధి చెందిన ట్రావెన్‌కోర్ సిస్టర్స్ లలిత, పద్మిని, రాగిణిల మేనకోడలైన శోభన 1966 మార్చి 21న తిరువనంతపురంలో జన్మించారు. తొలి సినిమా 'విక్రమ్' (హీరో నాగార్జున)ద్వారా తెలుగుతెరకు పరిచయమయ్యారు. రెండుసార్లు జాతీయ ఉత్తమనటి పురస్కారం అందుకున్నారు. భరతనాట్యంలోనూ ఎంతో ముఖ్యమైన అభినయాన్ని ప్రదర్శించడంలో దిట్ట. చెన్నైలోని కళార్పణ సంస్థ ద్వారా మూడు దశాబ్దాలుగా భరతనాట్యంలో శిక్షణ ఇస్తున్నారు. 2022లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

విదేశాల్లో ఉన్నత చదువులకు 'ప్రొపెల్డ్' రుణసదుపాయం



బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మెట్రోనగరాలతో పాటు ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలకు చెందినవారు విదేశాలలో ఉన్నత చదువులకు వెళ్ళదలచుకుంటే ప్రొపెల్డ్ రుణసదుపాయం కల్పించనుందని ప్రకటించింది. ఈమేరకు బెంగళూరులో బుధవారం ప్రొపెల్డ్ కోఫౌండర్ బ్రిజేష్ సామంత్‌రాయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని మెట్రోతో పాటు ప్రధాన నగరాల విద్యార్థులకు సాయం చేస్తామన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల క్రెడిట్ అర్హతకు అనుగుణంగా ప్రత్యేకమైన హామీకత్తుతో గరిష్ఠంగా పదేళ్ళపాటు విదేశాలకు వెళ్ళేవారికి రూ.50లక్షల దాకా రుణాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఉన్నత విద్యను విదేశాలలో పూర్తి చేయదలచిన వారి కోసమే రుణాలన్నారు. ఈ ఏడాది వందకోట్ల మేరన టార్గెట్‌గా ఉందని ప్రకటన ద్వారా తెలిపారు. 2030నాటికి దేశీయ విద్యార్థులు ప్రపంచంలోని అగ్ర విశ్వవిద్యాలయాలలో కోర్సులకు సహకరించాలన్నదే ఆశయమన్నారు. ఎస్ఎంఈ, ఎంఎస్ఎంఈ నిర్వాహకులు, స్వయం ఉపాధి పొందిన వ్యక్తులకు క్రెడిట్‌కు అనుగుణంగా రుణసదుపాయం కల్పిస్తామన్నారు. ప్రొపెల్డ్ ఎడ్యుకేషనల్ డైరెక్ట్ సెల్లింగ్ ఏజెంట్స్ ద్వారా సౌలభ్యం కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలే మా ఎన్నికల అస్త్రాలు

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న పలు సాహసోపేత నిర్ణయాలు, సాధించిన విజయాలు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే తమ ఎన్నికల ప్రధాన ప్రచారాస్త్రాలుగా ఉంటాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సునీల్ కుమార్ ప్రకటించారు. బెంగళూరు మల్లేశ్వరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం వివిధ విభాగాలకు చెందిన నేతలతో ఎన్నికల వ్యూహాలపై ఆయన సమాలోచనలు జరిపారు. ప్రతిబూత్‌లోనూ పార్టీకి గరిష్ఠంగా ఓట్లు లభించేలా విభాగాల పదాధికారులు చొరవ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీలో కష్టించి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని భవిష్యత్తులో ఎలాంటి కీలక పదవులైనా లభించే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. కేంద్రంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను కూడా బలంగా తిప్పికొట్టాలని ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని కోరారు. అభ్యర్థిఎవరైనా సరే నరేంద్రమోదీని ముచ్చటగా మూడోసారి ప్రధానిగా చూడాలన్న సంకల్పంతోనే ముందుకు సాగాలని ఆయన పార్టీ శ్రేణులకు హితబోధ చేశారు. పార్టీ విభాగాల కన్వీనర్లంతా ఈ సమావేశానికి హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

డాక్టర్ మంజునాథ్ మా పార్టీ అభ్యర్థి కాదు..

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉత్తర నుంచి పోటీ చేస్తున్న డాక్టర్ సీఎన్ మంజునాథ్ తమ పార్టీ అభ్యర్థి కాదని జేడీఎస్ సీనియర్ నేత జీటీ దేవేగౌడ అభిప్రాయపడ్డారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ మంజునాథ్ బీజేపీ అభ్యర్థి అంటూ వివరణ ఇచ్చారు. మంజునాథ్ సాధనలను గుర్తించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రహోంమంత్రి అమిత్‌షాలు బీజేపీలోకి ఆహ్వానించారన్నారు. మంజునాథ్ ఎ ప్పుడూ రాజకీయాలు మాట్లాడలేదన్నారు. ఆయనకు రాజకీయాలు అనేవి తెలియవన్నారు. మాజీ ప్రధాని దేవేగౌడ అల్లుడు అయినా ఎక్కడా రాజకీయాలకు సంబంధించిన సభలలో కానీ, వ్యాఖ్యలు కానీ చేయలేదన్నారు. దేవేగౌడ ప్రధానిగా ఉన్నా, రాష్ట్రంలో కుమారస్వామి రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్నా ఎక్కడా ఆయన రాజకీయాలతో సంబంధాలు పెట్టుకోలేదన్నారు. వైద్యుడిగా ఆయన సేవలను దేశమంతటా గుర్తించిందని కొనియాడారు.

ప్రేమికుల ఆత్మహత్యాయత్నం

● యువకుడి మృతి ● ప్రాణాపాయస్థితిలో యువతి



రాజు(ఫైల్)

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రేమికులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. హాస్ జిల్లా హొళేనరసీపురకు చెందిన ప్రేమికులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా యువకుడు మృతి చెందగా యువతి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. హొళేనరసీపుర తాలూకా నగరనహళ్ళికి చెందిన రాజు(20) ఇదే ప్రాంతానికి చెందిన ద్వితీయ పీయూ చదివే విద్యార్థినితో కొన్నేళ్ళుగా ప్రేమలో ఉన్నారు. ఒకే కళాశాలలో చదివే వీరు తొలుత స్నేహితులుగా కాగా ఆతర్వాత ప్రేమికులయ్యారు. యువతి తల్లి మృతి చెందడంతో అవ్వ ఇంట్లో ఉంటూ చదువుకొంటున్నారు. ఇక రాజు కుటుంబం పేదరికం కారణంగా డిగ్రీ మధ్యలోనే ఆపి మైసూరులో ఉద్యోగం చేస్తున్నారు. పీయూ పరీక్షలు ముగియగానే యువతికి పెళ్ళి చేస్తారనే సమాచారం తెలుసుకున్న రాజు మంగళవారం హొళేనరసీపురకు వచ్చారు. యువతితో కలిసి హేమావతి నది సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు సాయంత్రం చేరుకున్నారు. ఇద్దరూ క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి సిద్ధమయ్యారు. అంతలోనే స్థానికులు వారిని గమనించారు. అడ్డుకునే సరికే ఇద్దరూ మందు తాగేశారు. వెంటనే హొళేనరసీపుర పోలీసులకు స్థానికుల సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఇద్దరినీ పోలీసు వాహనంలోనే పట్టణ ఆసుపత్రికి తీసుకెళ్ళి ప్రథమ చికిత్స జరిపించి హాసన్ మెడికల్ కళాశాలకు తరలించారు. రాత్రి పొద్దుపోయాక రాజు మృతి చెందగా యువతి చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అరిసికెరె రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రామేశ్వరం కెఫే బాంబు పేలుడు కేసు..

● తమిళనాడు, కేరళ ఎన్ఐఏ బృందాల అప్రమత్తం

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫేలో బాంబు పేలుళ్ళ కేసును విచారణలు చేపట్టిన ఎన్ఐఏ అధికారులు తమిళనాడు, కేరళ రాష్ట్రాల ఎన్ఐఏ అధికారులను అప్రమత్తం చేశారు. దర్యాప్తు చేస్తున్న అధికారులు వివిధ కోణాలలో దర్యాప్తు సాగిస్తున్నా సమగ్ర ఆధారాలు లభించని మేరకు పొరుగు రాష్ట్రాల అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూరులో కారు బాంబ్ పేలుడు కేసులో అరెస్టు అయిన నలుగురితో పాటు కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌లో ఆర్ఎస్ఎస్ నేతను హతమార్చిన కేసుకు సంబంధించి ఒకరితో కలిపి సంబంధిత రాష్ట్రాల ఎన్ఐఏ అధికారులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. కారుబాంబు పేలుళ్ళ కేసులో ఉండే జమీల్‌పాషాఉమ్రి, మహమ్మద్ హుసేన్, ఇర్షత్, సయ్యద్ అబ్దుల్, రెహమాన్‌తో పాటు పాలక్కాడ్‌లో ఆర్ఎస్ఎస్‌నేత శ్రీనివాస్‌ను హత్యచేసిన కేసుకు సంబంధించి షఫీక్‌ను రహస్య ప్రదేశంలో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. రామేశ్వరం కెఫే బాంబుపేలుడు నిందితుడు తమిళనాడు, కేరళ ప్రయాణించినట్లుగా గుర్తించిన అధికారులు రెండు రాష్ట్రాల ఎన్ఐఏ అధికారులను అప్రమత్తం చేశారు. కాగా శివమొగ్గ ట్రయల్ బ్లాస్ కేసు నిందితుడు తీర్థహళ్ళికి చెందిన మాజ్ మునీర్‌ను రామేశ్వర్ కెఫే పేలుడు కేసులో బాడీవారెంట్ ద్వారా అదుపులోకి తీసుకుని ఏడు రోజులుగా విచారణ జరుపుతున్నారు.

మైనార్టీలు లేకపోయినా విద్యాసంస్థలకు గుర్తింపు

●మంత్రి శరణ ప్రకాష్ పాటిల్



బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు చెందిన సంస్థలు నిర్వహించే విద్యా సంస్థల్లో తప్పనిసరిగా నిర్దిష్ట ప్రమాణంలో మైనార్టీ విద్యార్థులు ఉండాల్సిందే అన్న నిబంధనను ప్రభుత్వం రద్దుచేసింది. ఈ విషయాన్ని వైద్య విద్యాశాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ బుధవారం మీడియాకు తెలిపారు. మైనార్టీలైన ముస్లిం, క్రైస్తవ, సిఖ్, జైన, బౌద్ధ, పార్శీ మతాలకు చెందిన సంస్థలు నిర్వహించే విద్యాసంస్థల్లో ఈ వర్గాలకు చెందిన విద్యార్థుల సంఖ్యను ఇకపై పరిగణనలోకి తీసుకోబోరు. మైనార్టీలకు చెందిన విద్యార్థులు లేకపోయినా గుర్తింపునకు ఎలాంటి ఢోకా ఉండదని స్పష్టంచేశారు. ఇటీవలి మంత్రి మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు కూడా జారీ చేశామన్నారు. నిర్దిష్టసంఖ్యలో మైనార్టీ విద్యార్థులు ఉంటనే గుర్తింపు అనే నిబంధన కారణంగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నసమయంలో గందరగోళం ఏర్పడుతోందని దీన్ని నివారించేందుకే ఈ కీలక నిర్ణయం తీసుకున్నామని మంత్రి వివరించారు.

ప్రమాదకరమైన కుక్కలపై నిషేధం..

● కేంద్రం ఆదేశాలకు హైకోర్టు బ్రేక్



బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): క్రూరం, ప్రమాదకరంగా భావించే పెంపుడు కుక్కల జాతుల కొనుగోళ్ళు, ఎగుమతులు, సంతానోత్పత్తి నిషేధించేలా చర్యలు చేపట్టాలనే కేంద్రప్రభుత్వం ఆదేశాలకు హైకోర్టు ధర్మాసనం బ్రేక్ పెట్టింది. మనుషుల ప్రాణాలకు ప్రమాదకరంగా పరిగణించబడిన 23 జాతుల పెంపుడు కుక్కలపై కేంద్రప్రభుత్వం ఈనెల 14న నిషేధం విధిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈమేరకు బెంగళూరు నివాసి సోలోమన్ డేవిడ్, మార్డోనా జోన్స్‌లు దాఖలు చేసిన పిటీషన్‌పై న్యాయమూర్తి ఎం నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. కేంద్రప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌కు సంబంధించిన సమగ్ర అంశాలను సమర్పించాలని కేంద్రప్రభుత్వం తరుపు న్యాయవాదిని సూచించింది. మనిషి జీవనానికి ప్రమాదకరమనే జాతి కుక్కలను గుర్తించేందుకు సమగ్ర అధ్యయనం చేయాలని పిటీషనర్ తరుపు న్యాయవాది అభిప్రాయపడ్డారు. కేంద్రప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌కు కర్ణాటకలో మాత్రమే వర్తించేలా బ్రేక్ పెట్టారు. తదుపరి సమగ్ర వివరాలు సమర్పించాలని న్యాయవాదిని ధర్మాసనం ఆదేశించింది.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం

● రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మనోజ్‌కుమార్ మీనా

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వం స్థాపించే ఎన్నికలలో మీడియా పాత్ర కీలకమైనదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మనోజ్‌కుమార్ మీనా అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సమాచారశాఖ భవన్‌లో బుధవారం మీడియా ప్రతినిధులు, సమాచార శాఖ ఉద్యోగులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల కమిషనర్ మనోజ్‌కుమార్ మీనా మాట్లాడుతూ రాష్ట్రంలోని 28 లోక్‌సభ స్థానాలకు రెండువిడతలుగా పోలింగ్ జరుగనుందన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు సాగుతున్నాయన్నారు. 16శాఖల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు అవకాశం ఉందన్నారు. ఎన్నికల కోడ్ అమ లులో ఉందని రాజకీయ పార్టీలు, అభ్యర్థులతో పాటు మీడియాపైనా పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఏకపక్షంగా కథనాలు రాయడం నిబంధనల ఉల్లంఘన కిందికే వస్తుందన్నారు. ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్ వంటి వాటిపైనా పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా వేగవంతంగా సమాచారాన్ని చేరవేస్తున్నందున వాటిపైనా నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు ఎన్నికల కమిషనర్లు వెంకటేష్‌కుమార్, కూర్మారావ్, సూర్యసేన్, సమాచార శాఖ కమీషనర్ హేమంత్ నింబాళ్కర్, సీనియర్ పాత్రికేయులు ఈశ్వర్‌దైతోట వివిధ అంశాలపై అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



ఓటు వేయాలని సంకేతం చూపుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్, అధికారులు

సందేశాల సంబరాలకు వేదిక స్నాప్‌చాట్..

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్నాప్‌చాట్ ద్వారా యువత సందేశాలు, సంబరాలు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని ఎండీ పుల్కిత్ త్రివేది అభిప్రాయపడ్డారు. బెంగళూరు యువతతో స్నాప్‌చాట్ ప్రత్యేక చర్చాగోష్టి బుధవారం నిర్వహించారు. విశ్వవ్యాప్తంగా జెన్‌జెడ్ వాడేవారిలో 20శాతం మంది దేశంలోనే ఉన్నారన్నారు. స్నాప్‌చాట్ యాప్ ఒక ఆత్మీయ సంబంధంగా మార్చుకున్నారన్నారు. ఇతర ప్లాట్‌ఫారంల కంటే డైనమిక్ అనిపిస్తోందనే అభిప్రాయాలు ఉన్నాయన్నారు. పండుగలతో పా టు ఎటువంటి సందర్భమైనా స్నాప్‌చాట్‌ను వేదికగా చేసుకుని బంధుమిత్రులతో సరదగా అభిప్రాయాలు పంచుకుంటున్నారన్నారు. స్నాప్‌చాట్ మూలం కెమెరా ఫస్ట్ విధానంతో ఆరంభమైనా ప్రస్తుతం సందేశాలు, ఫోటోలతో పాటు అన్ని సందర్భాలను వినియోగించుకుంటున్నారన్నారు. దేశంలో స్నాప్‌చాట్ 200ల మిలియన్‌ల మంది వాడుతున్నారని యూగౌ సర్వే తేల్చిందని బెంగళూరులో 85శాతం అప్లికేషన్‌ను వాడుతున్నారన్నారు. 66శాతం మంది లైక్స్, షేర్‌లను పోస్ట్ చేస్తున్నారన్నారు. స్నాప్‌చాట్ వేదికగా ప్రకటనలకు ఆదరణ లభిస్తోందని అభిప్రాయపడ్డారు. స్నాప్‌చాట్ ప్రతినిధులు విభిన్నమైన అంశాలపై అనుభవాలను, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు.

కనుమరుగవుతున్న పిచ్చుకలు

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కిచకిచ శబ్దాలతో ఎంచక్కా ధాన్యం గింజలు ఏరుకుని సందడిచేసే పిచ్చుకల సంతతి రానురాను కనుమరుగైపోతున్నదా? పర్యావరణ ప్రేమికులు ఇందుకు ఔననే సమాధానం ఇస్తున్నారు. అత్యంత శక్తివంతమైన మొబైల్ టవర్లు పిచ్చుకల పాలిట బ్రహ్మాస్త్రాలుగా మారాయని అంటున్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా బుధవారం రాజధానిలో పలుచోట్ల పిచ్చుకలను సంరక్షించుకునేందుకు జాగృతి కార్యక్రమాలను నిర్వహించారు. వేసవి తాపంతో అలమటిస్తున్న పిచ్చుకలతో పాటు చిలుకలు, పావురాలు ఇతర పక్షులను కాపాడేందుకు మిద్దెలు మేడలు, అపార్ట్‌మెంట్లపై కాసిని నీళ్ళు ఉంచాలని విజ్ఞప్తిచేశారు. బెంగళూరులోని లాల్‌బాగ్, కబ్బన్ పార్కులతో పాటు అక్కడక్కడా కొన్ని చాట్ల పిచ్చుకల ఉనికి ఇంకా కనిపిస్తోందన్నారు.

పులకించిన భక్తజనం

● ఖాద్రీశుడి కల్యాణోత్సవానికి భారీగా హాజరైన జనం ● భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ



ధ్వజారోహణ గావిస్తున్న అర్చకులు

కదిరి, మార్చి 20: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి శ్రీదేవీ, భూదేవీ సమేత ఖాద్రీశుడి కల్యాణోత్సవం కనుల పండువలా జరిగింది. కల్యాణానికి భక్తులు విశేషంగా హాజరయ్యారు. స్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించిన భక్తులు పులకించి పోయారు. కల్యాణాన్ని కనులారా వీక్షిస్తే సకల పాపహరణం సాధ్యమని భక్తుల విశ్వాసం. తొలుత యాగశాలలో కొలువుతీరిన వధువులను శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను, వరుడు శ్రీవారిని వేర్వేరుగా పల్లకిలలో కళ్యాణమంటపానికి చేర్చారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల న డుమ శ్రీవారి ప్రతిరూపంగా విచ్చేసిన కంకణ భట్టాచార్యుల వారు అమ్మవార్లకు మాంగళ్య ధారణ గావించారు. లోక సంక్షేమం సర్వ భక్త జనుల కొరకు శ్రీవారి వార్షిక కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. నవ నారసింహ క్షేత్రాల్లో ప్రధాన క్షేత్రమైన కదిరిలో జరిగే బ్రహ్మోత్సవాల్లో జరిగే వార్షిక కళ్యాణం కోసం వేలాది భక్తులు తరలి వస్తారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేడు హంస వాహనం శ్రీవారి దర్శనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ నరసింహస్వామి భక్తులకు గురువారం హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. తిరువీధుల్లో స్వామి వారు ఊరేగనున్నారు.

పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ

పావగడ, మార్చి 20: పేద విద్యార్థుల లక్ష్యసాధనకు ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తేజస్ చారిటబుల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు గాయిత్రిబాయి తెలిపారు. స్థానిక తేజస్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ద్వితీయ సంవత్సరం విజ్ఞాన విభాగంలో విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించడానికి కేఈసీటీ, నీట్ విషయాలు ఎంతో అవసరమన్నారు. ఇతర ప్రాంతాలలో ఆ శిక్షణ శిబిరాలకు రూ.లక్షల్లో ఖర్చు పెట్టాల్సి ఉంటుందన్నారు. పేద విద్యార్థుల అభ్యున్నతి కోసమే తండ్రి మాజీ ఎమ్మెల్యే సోమ్లానాయక్, భర్త శంకర్‌మూర్తి నాయక్ ప్రోత్సాహంతో ట్రస్టు స్థాపించినట్లు తెలిపారు. గత ఏడాది ఆగస్టు నుంచి 80 మంది పేద విద్యార్థులకు శిక్షణ ఇచ్చామని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరు ఉన్నత విద్యలో రాణిస్తేనే మరొకరికి మార్గదర్శకులు కాగలరని శంకరమూర్తినాయక్ అన్నారు. ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించి విద్యా సౌకర్యాలు అందించిన ట్రస్టుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సంఘం డైరెక్టర్ కె.వి.శ్రీనివాస్, కోచింగ్ మాస్టర్ వినోద్‌కుమార్, కె.సి.దాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన విద్యార్థులతో తేజస్ ట్రస్టు సభ్యులు

ఐసీయూ వార్డులో పనిచేయని ఏసీలు

● సొంతంగా ఫ్యాన్లు ఏర్పాటు చేసుకున్న రోగులు

బెంగళూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ పరిస్థితి దారుణంగా మారుతోంది. కలబురగి మెడికల్ కళాశాల ఆసుపత్రి ఐసీయూ వార్డుల్లో రోగులు గాలి ఆడక ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఐసీయూ వార్డులో నెలరోజులుగా ఎయిర్ కండిషన్లు పనిచేయడం లేదు. శస్త్ర చికిత్సలు, ఇతర అత్యవసర వైద్యం కోసం ఐసీయూలో అడ్మిట్ చేస్తామంటే రోగులు హడలెత్తిపోతున్నారు. ఐసీయూ వార్డులో 14 మంది రోగులు చికిత్సలు పొందుతున్నారు. ఏసీలు పనిచేయక పోవడం, ఎండలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో రోగులు అల్లాడిపోతున్నారు. కలబురిగిలో 35 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆసుపత్రి ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో రోగులే ఫ్యాన్లు సమకూర్చుకుంటున్నారు. ఈ విషయమై జిల్లాకు చెందిన వైద్య విద్యాశాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాష్ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ, ఐసీయూ వార్డులో ఏసీలు పనిచేయడం లేదనే విషయం తన దృష్టికి వచ్చిందని, వెంటనే సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



ఐసీయూ వార్డులో రోగులు ఏర్పాటు చేసుకున్న ఫ్యాన్

అశ్వవాహనంపై విహరించిన చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ,మార్చి20: పట్టణంలోని గవిమఠ స్థిత చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం లంకాదహనం నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవమూర్తిని గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడివరకూ ఊరేగించారు. లంకాదహన కార్యక్రమాన్ని ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ ప్రారంభించారు. అనంతరం ఉత్సవ మూర్తిని లంకాదహనం ఎదుట ఉంచి పెద్దసంఖ్యలో బాణాసంచా కాల్చారు. మిరుమిట్లు గొలుపే కాంతులు భక్తులను అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరైయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. అలాగే అశ్వ వాహనంపై చంద్రమౌళీశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తి అశ్వవాహనంపై కొలువుదీర్చి గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆదోని చౌకిమఠం పీఠాధిపతి కల్యాణ్‌స్వామి, సిబ్బంది నారాయణస్వామి, మధు, వెంకటేశులు, రఘు పాల్గొన్నారు.



స్వామివారి ఊరేగింపులో ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి